లగచర్ల తొలి గెలుపు

మొదటిపేజీ తరువాయి...

లగచర్లలో 110.32 ఎకరాల భూసేకరణ నిమిత్తం 2024 నవంబర్‌లో జారీచేసిన భూసేకరణ నోటిఫికేషన్ల అమలును నిలిపివేస్తూ స్టే విధించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జే శ్రీనివాస్‌రావు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను ఏప్రిల్ 7కు వాయిదా వేశారు. సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీచేశారు.

హైకోర్టు స్టే ఆదేశాలతో పటాకులు కాల్చి సంబరాలు జరుపుకుంటున్న రోటిబండతండా రైతులు, గ్రామస్తులు

ఏడాదికి పైగా పోరాటం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్టు ప్రకటించి, ఫార్మావిలేజ్‌లను తెరమీదకి తెచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఫార్మావిలేజ్ ఏర్పాటుకు గత సంవత్సరం మార్చిలో ఏర్పాట్లు మొదలయ్యాయి. దుద్యాల మండలంలోని భూములను అధికారులు పరిశీలించారు. దీంతో రైతులు తమ భూములను గుంజుకోవద్దని, ఫార్మా కంపెనీలు కట్టొద్దని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. తమ భూములు ఇచ్చేదిలేదని బాధిత రైతులు నెలల తరబడి దీక్షలు చేస్తూ, నిరసన వ్యక్తంచేశారు. ప్రభుత్వం మొండిపట్టుదలకు పోయింది. దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట, పోలేపల్లి, రోటిబండతండా, పులిచర్లకుంట తండాల పరిధిలో ఫార్మా విలేజ్ ఏర్పాటుకు ఆగస్టులో నోటిఫికేషన్ జారీ చేసింది. 1,375 ఎకరాలు సేకరించాలని సర్కారు నిర్ణయించింది. ఇందులో 600 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉండగా, మిగిలిన 775 ఎకరాల భూమిని రైతుల వద్ద సేకరించాలని నిర్ణయించింది. అక్టోబర్ 25న లగచర్లలో ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సమావేశానికి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి అనుచరుడు, కాంగ్రెస్ దుద్యాల మండల అధ్యక్షుడు శేఖర్ వాహనాన్ని రోటిబండతండా వద్ద రైతులు అడ్డుకొని, దాడి చేశారు. ఈ ఘటన తర్వాత కూడా రైతుల వేదనను ప్రభుత్వం అర్థం చేసుకోలేదు. నవంబర్ 11న దుద్యాల-హకీంపేట మధ్య గ్రామసభను ఏర్పాటు చేయగా, రైతులు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తోపాటు ఇతర అధికారులను అడ్డుకున్నారు. వాహనాలపై దాడి చేశారు.

అర్ధరాత్రి అరాచకం

ఎన్ని విధాలా ప్రయత్నించినా రైతులు భూములు ఇవ్వకపోవడంతో ప్రభుత్వం కక్ష కట్టింది. కలెక్టర్‌పై దాడి చేశారనే నెపంతో నవంబర్ 12న అర్ధరాత్రి లగచర్ల, రోటిబండతండాలపై వందలాది పోలీసులు విరుచుకుపడ్డారు. కరెంటు సరఫరా నిలిపివేసి, తలుపులు బద్దలు కొట్టి, పదుల సంఖ్యలో రైతులను అదుపులోకి తీసుకున్నారు. మహిళలు, వృద్ధులపై కూడా దాడి చేశారని స్థానికులు ఆరోపించారు. మొదట 16 మందిని అరెస్టు చేయగా, ఆ తర్వాత దశలవారీగా మరి కొంతమందిని అదుపులోకి తీసుకొని జైల్లో పెట్టారు. అందరిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఇప్పటికీ ఆ రైతులు కేసులను ఎదుర్కొంటూ కోర్టులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. కలెక్టర్‌పై దాడికి సూత్రధారి అంటూ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని సైతం ప్రభుత్వం అరెస్ట్ చేసింది. నవంబర్ 12న అర్ధరాత్రి జరిగిన అరాచకంపై లగచర్ల గ్రామస్తులు పోరాటానికి దిగారు. తమకు జరిగిన అన్యాయంపై గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాడారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్, మానవ హక్కుల కమిషన్, ఇతర సంఘాలను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ప్రభుత్వ దాష్టీకంతో ఆగమైన రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచింది. వారికి గొంతుకగా మారింది. వారి వేదనను ఢిల్లీ వరకు వినిపించేలా ఆర్థిక, రాజకీయ, న్యాయపరమైన సహాయం చేసింది. అవసరమైతే, దేశంలోనే టాప్ లాయర్లను తీసుకువచ్చి కోర్టుల్లో వాదించి న్యాయం చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ అండతో లగచర్ల రైతులు తమ భూముల కోసం, న్యాయం కోసం పోరాటం కొనసాగించారు. చివరికి హైకోర్టు వారికి ఊరట కల్పించింది. వికారాబాద్ జిల్లాలో మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుచేయాలన్న ప్రభుత్వ చర్యలకు హైకోర్టు బ్రేక్ వేసింది. ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ ప్రక్రియను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

'అత్యవసరం' ఏముంది?

దేశ రక్షణ, అత్యవసర నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం వంటి అత్యవసర అవసరాల నిమిత్తం భూసేకరణ చేసేందుకు వీలు కల్పించే భూసేకరణ చట్టం-2013లోని సెక్షన్ 10(ఏ) నిబంధనను మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు పేరుతో ప్రభుత్వం జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్లను వ్యతిరేకిస్తూ పీ గోపాల్‌నాయక్ సహా 15 మంది రైతులు, కే శివకుమార్, ఇతర రైతులు దాఖలు చేసిన రెండు వేర్వేరు వ్యాజ్యాలపై గురువారం ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టింది. కారణం చెప్పకుండా 'అత్యవసర భూసేకరణ' నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయడాన్ని కోర్టు ప్రాథమికంగా తప్పుబట్టింది. అత్యవసర భూ సేకరణను ఎందుకు చేయాలని నిర్ణయించారో వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రతివాదులైన రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ (భూసేకరణ), వికారాబాద్ జిల్లా కలెక్టర్, లగచర్ల రెవెన్యూ డివిజన్ ఆఫీసర్, దుద్యాల తహసీల్దార్, తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌కు నోటీసులు జారీచేసింది.

భూసేకరణ నోటిఫికేషన్లు చట్ట వ్యతిరేకం

పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు బీఎస్ ప్రసాద్, వీ రఘునాథ్ వాదించారు. పారిశ్రామికవాడ ఏర్పాటు కోసం ప్రభుత్వం గత ఏడాది నవంబర్‌లో ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చిందని, మొత్తం 1,177 ఎకరాల్లో 534 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయని, మిగిలినవి పట్టా భూములని కోర్టుకు వివరించారు. పట్టా భూముల సేకరణకు ప్రభుత్వం చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ ప్రక్రియలో భాగంగా లగచర్లలో 110 ఎకరాలు, హకీంపేటలో 351 ఎకరాల రైతుల భూములను అత్యవసర ప్రాతిపదికపై భూ సేకరణకు నోటిఫికేషన్లు ఇచ్చిందని పేర్కొన్నారు. భూసేకరణ చట్ట నిబంధనలకు విరుద్ధంగా భూమిని సేకరిస్తున్నారని వాదించారు. భూసేకరణ నోటిఫికేషన్లలో ఎంత భూమి అవసరమో, ఏ అవసరాల కోసం భూసేకరణ చేస్తున్నారో వివరాలు ఏమీ లేవని తెలిపారు. భూసేకరణ చట్టంలోని సెక్షన్ 10 (ఏ) ప్రకారం అత్యవసర భూసేకరణ చేపట్టే అధికారం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, ఆ 'అత్యవసరం' ఏమిటో నోటిఫికేషన్‌లో పేర్కొనాలన్న నిబంధనను ప్రభుత్వమే ఉల్లంఘించిందని వివరించారు. భూమి సేకరణ ఎందుకు చేపడుతున్నారనే వివరాలు నోటిఫికేషన్లలో పేర్కొనలేదని తప్పుబట్టారు.

అత్యవసర భూసేకరణ ఎందుకో చెప్పకుండానే..

దేశభద్రత, నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో 'అత్యవసరం' వంటి కీలక అంశాలతో ముడిపడినప్పుడు మాత్రమే ఆ నిబంధన కింద అత్యవసర భూసేకరణ చేయాలని బీఎస్ ప్రసాద్ చెప్పారు. సామాజిక ప్రభావ అధ్యయనం, ప్రజాభిప్రాయ సేకరణ, మార్కెట్ విలువ, పునరావాసం, పునర్నిర్మాణం మొదలైవి నిర్ధారణ చేయకుండానే ప్రభుత్వం భూ సేకరణ ప్రక్రియ చేపట్టడం చెల్లదని వాదించారు. ఎందుకు భూసేకరణ చేస్తున్నదీ భూమిని కోల్పోబోయే రైతులకు చెప్పాలని, అయితే, ప్రభుత్వం వాటిని వివరించకుండా ఏకపక్షంగా భూసేకరణ ప్రక్రియను ప్రారంభించి చట్ట నిబంధనలకు నీళ్లు వదిలిందని వివరించారు. మల్టీపర్పస్ ఇండస్ట్రియల్‌పార్క్ ఏర్పాటుచేస్తున్నామని చెప్పి జీవనాధారమైన రైతుల భూములను ఏకపక్షంగా, చట్ట వ్యతిరేకంగా సేకరణ చేయడానికి వీల్లేదని వాదించారు. రైతుల జీవనాధారం ఈ భూములేనన్న కీలక విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని హైకోర్టును కోరారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వం కాలరాస్తూ రైతుల నుంచి భూములను గుంజుకోడానికి వీల్లేదని చెప్పారు. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా చేపట్టిన భూసేకరణ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు.

రెండు పిటిషన్లు ఇవీ..

లగచర్లలో ఫార్మావిలేజ్‌ల ఏర్పాటు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నవంబర్‌లో వెనక్కు తీసుకున్నది. లగచర్లతోపాటు హకీంపేట, పోలేపల్లిలో దాదాపు 1,358 ఎకరాల భూ సేకరణకు ఇచ్చిన ప్రాథమిక నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకున్నది. అయితే ఫార్మావిలేజ్‌లకు బదులుగా మల్టీపర్పస్ ఇండస్ట్రియల్‌పార్కు ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. దీనికోసం లగచర్ల, హకీంపేట, పోలేపల్లి, రోటిబండతండా, పులిచెర్లకుంట తండాల్లో 1,177.35 ఎకరాలు సేకరించేలా 2024 నవంబర్ 29న ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేసింది. ఇందులో 534 ఎకరాలు సర్కార్‌భూమి కాగా, మిగతా 643 ఎకరాలు పట్టా భూమి. లగచర్లలో 110.32 ఎకరాలు, హకీంపేటలో 351.10 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్లు జారీ చేసింది. లగచర్లకు చెందిన నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ పీ గోపాల్‌నాయక్‌తోపాటు మరో 14 మంది ఒక పిటిషన్, హకీంపేటకు చెందిన భూముల సేకరణ నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ కే శివకుమార్ మరో పిటిషన్ దాఖలు చేశారు.

స్టే ఇవ్వొద్దన్న సర్కార్

ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ, రైతులకు తగిన పరిహారం చెల్లిస్తున్నామని, ఆ తర్వాతే భూములు తీసుకుంటామని చెప్పారు. ఒక్కో ఎకరాకు రూ.20 లక్షల పరిహారంతోపాటు 150 గజాల ఇంటిస్థలం, ఇందిరమ్మ పథకం కింద ఇంటి నిర్మాణానికి సాయం అందజేస్తామని తెలిపారు. అర్హులైన వారికి ఉద్యోగ కల్పన కూడా ఉంటుందని చెప్పారు. ఈ ప్రక్రియను చాలామంది రైతులు ఆమోదించారని, భూసేకరణ ప్రక్రియపై స్టే ఆదేశాలు ఇవ్వొద్దని కోరారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు, ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. సమగ్ర వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 7కి వాయిదా వేసింది. అప్పటివరకు భూసేకరణ ప్రక్రియలో ముందుకెళ్లరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

చట్టంలో ఏముందంటే..

అత్యవసర భూ సేకరణ నిమిత్తం గతంలో రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చట్టం-2013లో సెక్షన్-10ఏ, సెక్షన్-40లను చేర్చింది. వీటి కింద భూసేకరణ చేయాలంటే అత్యవసరంగా భూసేకరణ ఎందుకు చేపట్టేదీ నోటిఫికేషన్‌లో పేర్కొనాలి. భూ సేకరణ చట్టం-2013లోని ఈ సెక్షన్ల ప్రకారం.. ప్రజలు, రైతుల అభిప్రాయం, గ్రామసభలు అవసరం లేకుండా నేరుగా భూ సేకరణ చేపట్టవచ్చు. ఇది దేశభద్రత, అత్యవసర ప్రాజెక్టుల నిర్మాణాల నిమిత్తం భూసేకరణ చేసేందుకు వీలుంటుంది. భూములు కోల్పోయే రైతులకు కూడా అత్యవసర ప్రాజెక్టు ఆవశ్యకత విషయాలను తెలియజేయాలి. నిర్దేశించిన ప్రాజెక్టుకు అవసరమైన భూమిని మాత్రమే ప్రభుత్వం సేకరణ చేయాలి. ఇవేమీ చేయకుండా ఆ సెక్షన్ల కింద బలవంతంగా భూమిని సేకరించడానికి వీల్లేదు. ఈ భూ సేకరణ ఎందుకు చేస్తున్నదీ, అత్యవసర భూసేకరణ ఎందుకు వచ్చిందీ, అలాంటి అవసరం ఏముందీ? తదితర వివరాలను నోటిఫికేషన్‌లో పేర్కొనలేదు. ప్రభుత్వం తీరు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా, రాజ్యాంగంలోని 14,19,21 అధికరణలను ఉల్లంఘించి వెలువరించిన భూసేకరణ నోటిఫికేషన్ చెల్లదని పిటిషనర్లు వ్యాజ్యాల్లో పేర్కొన్నారు.

నిరుపేద రైతుల భూములను లాక్కోవడం దారుణం

పిటిషనర్లు నిరుపేద రైతులని, సదరు భూమిని సాగు చేసుకుంటూ వ్యవసాయమే జీవనాధారంగా బతుకున్నారని బీఎస్ ప్రసాద్ చెప్పారు. ఫార్మావిలేజ్ వద్దంటూ పోరాటం చేయగానే ప్రభుత్వం ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేసిందని గుర్తుచేశారు. ఆ తర్వాత రెండు రోజులకే బహుళార్థసాధక పారిశ్రామిక పార్కు (మల్టీపర్పస్ ఇండస్ట్రియల్‌పార్క్) పేరిట నోటిఫికేషన్లు జారీ చేయడం దారుణమని పేర్కొన్నారు. నిపుణుల సామాజిక ప్రభావ అంచనా నివేదిక, ప్రజాభిప్రాయ సేకరణ, మార్కెట్ విలువ నిర్ధారణ లేకుండా భూ సేకరణకు ఉపక్రమించి చట్టాన్ని తుంగలోకి తొక్కిందని తెలిపారు. అత్యవసర భూ సేకరణ ఎందుకో వెల్లడించకుండా, భూసేకరణ చట్టంలోని సెక్షన్-10(ఏ) కింద భూమిని సేకరించేందుకు ప్రభుత్వం అడ్డదారిలో పయనించిందని, ప్రభుత్వ చర్య రాజ్యాంగ విరుద్ధమని కోర్టుకు విన్నవించారు.

లోకం పోకడ

ఇంకేం మన రాష్ట్రం అమెరికా అయిపోతుందన్న కోరిక ఇలా తీరబోతుందన్నమాట!

ప్రవీణ్ కుటుంబానికి కేటీఆర్ ఓదార్పు

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): అమెరికాలో దుండగుల దాడిలో మృతిచెందిన గంగ ప్రవీణ్ కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓదార్చారు. షాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేట మండలానికి చెందిన గంప రాఘవులు కుమారుడు గంప ప్రవీణ్‌ను దుండగులు హతమార్చిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా స్థానిక నేత రవీందర్ యాదవ్ ఫోన్ ద్వారా కేటీఆర్ రాఘవులుతో మాట్లాడి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. జరిగిన దారుణం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. ధైర్యంగా ఉండాలని.. వీలైనంత త్వరగా మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు భారత రాయబార కార్యాలయంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

అసంఘటిత కార్మికులకు పెన్షన్ ఇవ్వాలి

ఐఎల్‌వో ప్రకారం సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే

సెస్ వ్యవస్థాపక దినోత్సవంలో ప్రముఖ ఆర్థికవేత్త ప్రొ.సంతోష్ మెహ్రోత్రా

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): భారతదేశంలోని అసంఘటిత కార్మికులందరికీ సామాజిక భద్రత పెన్షన్ ప్రవేశపెట్టాలని ప్రపంచ ప్రసిద్ధ ఆర్థికవేత్త ప్రొఫెసర్ సంతోష్ మెహ్రోత్రా కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. దేశంలో సుమారు 91 శాతం మంది కార్మికులు అసంఘటితరంగంలో పని చేస్తున్నట్టు చెప్పారు. కేవలం 12 శాతం మందే అధికారిక పెన్షన్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్(సెస్) ఏడో వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని సెస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రతి సంవత్సరం సుమారు 50 లక్షల మంది వృద్ధాప్య దశలోకి చేరుతున్నారని, 2040 నాటికి దేశం వృద్ధాప్య సమాజంగా మారబోతున్నదని, ఇది కొంత కలవరపెట్టే అంశమని చెప్పారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) ప్రకారం ప్రభుత్వాలు వారందరికీ సామాజిక బీమా భద్రత కల్పించాల్సి ఉన్నదని తెలిపారు. పేద అసంఘటితరంగ కార్మికులకు ప్రభుత్వం వాటాగా చెల్లించే సామాజిక భద్రత బీమాను అందించడానికి జాతీయ ఆదాయంలో(జీడీపీ) 0.69 శాతం లేదా రూ.137 లక్షల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసినట్టు చెప్పారు. సమావేశంలో సెస్ వ్యవస్థాపక సభ్యులు ప్రొఫెసర్ మహేందర్‌రెడ్డి, జీఆర్ రెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ రేవతి, వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు, అధికారులతోపాటు సెస్ అధ్యాపకులు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పాలకుర్తిలో అత్తాకోడళ్లపై కాంగ్రెస్ కార్యకర్తల అసంతృప్తి

పీసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కు ఫిర్యాదు

తొర్రూరు, మార్చి 6 : పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. కాంగ్రెస్ పార్టీని పటిష్టంగా నిలబెట్టాలని శ్రమిస్తున్న కార్యకర్తలకు తీవ్ర నిరాశ ఎదురవుతున్నది. ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఆమె అత్త ఝాన్సీరెడ్డి పార్టీపై పూర్తి అధికారం ప్రదర్శిస్తూ, ఇతర నేతల అభిప్రాయాలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాయకత్వ లోపం వల్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలహీనపడుతున్నదనే ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు కాంగ్రెస్ కార్యకర్తలు లేఖ రాశారు. ప్రస్తుత నాయకత్వ వైఫల్యం వల్ల పార్టీ భవిష్యత్‌లో ప్రమాదంలో పడుతుందని, తక్షణ జోక్యం అవసరమని కోరారు. పాలకుర్తిలో కాంగ్రెస్ పార్టీ ప్రజల మద్దతు కోల్పోతున్నదని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఝాన్సీరెడ్డి పార్టీ కార్యకర్తలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పార్టీకి అంకితమైన కార్యకర్తలకు అవకాశం లేకుండా, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని వారు విమర్శిస్తున్నారు.

2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్?

సీఎం అంగీకరించారన్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపునకు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించినట్టు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి వెల్లడించారు. ఎమ్మెల్సీగా గెలుపొందిన శ్రీపాల్‌రెడ్డి గురువారం సీఎంను ఆయన నివాసంలో కలిశారు. ముఖ్యమంత్రి ఆయనకు శాలువాకప్పి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ ఇవ్వాలని కోరగా.. సీఎం సానుకూలంగా స్పందించారు. పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, పీఆర్టీయూ నాయకులు వెంకట్‌రెడ్డి, గుండు లక్ష్మణ్ పాల్గొన్నారు.

తలవంచని రైతులు

- నిర్బంధాలు, పోలీసు కేసులను ధీటుగా ఎదుర్కొంటూ పోరాటం
- ఇల్లు-వాకిలి వదిలి అలుపెరగని పోరాటం
- స్టేషన్ల చుట్టూ తిప్పినా సడలని ధైర్యం
- హైకోర్టు స్టేతో రైతుల్లో ఆనందం
- సొంత ఇలాకాలో సీఎంకు ఎదురుదెబ్బ

కొడంగల్, మార్చి 6: లగచర్ల తదితర గ్రామాల్లో ప్రభుత్వం భూములు సేకరించడంపై హైకోర్టు స్టే విధించడంతో ఆ గ్రామాల్లో అనందం వెల్లివిరిసింది. కాగా, ఇప్పటికే స్థానికులపై ప్రభుత్వం అనేక కేసులు పెట్టి జైల్లో వేయడం, బెయిల్‌పై ఉన్న వారందరూ వారం వారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సి ఉన్నందున గురువారం ఎక్కువసేపు స్టేషన్‌లోనే గడపాల్సి వచ్చింది. లగచర్ల రైతుల పోరాటం దేశానికే స్ఫూర్తిదాయకంగా నిలిచింది. రైతులు తమ భూములను కాపాడుకోవడానికి ఎక్కడికైనా వెళ్లగలరని, భూములను కాపాడుకోగలరని హైకోర్టు స్టేతో నిరూపించుకున్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ఫార్మా కంపెనీల ఏర్పాటులో భాగంగా భూసేకరణకు కోసం నోటిఫికేషన్ విడుదల చేసిన నాటి నుంచి రైతులు అలుపెరగని పోరాటం చేశారు. భూములు ఇవ్వబోమని రైతులు ఖరాఖండిగా చెప్పినప్పటికీ, అధికారులు మాత్రం తరచూ రైతులతో సమావేశాలు, అభిప్రాయ సేకరణ అంటూ భూసేకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్న నేపథ్యంలో అధికారుల వాహనాలపై దాడి జరిగింది. దీంతో అనేకమంది అమాయక రైతులపై కేసులు పెట్టి, అరెస్టులు చేయడంతో నెల రోజులకుపైగా జైలు జీవితం గడిపారు. పోరాటం ఉధృతం కావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గి ఫార్మా కంపెనీల ఏర్పాటు కోసం కాకుండా ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీచేసింది. భూ సేకరణ కోసం అధికారులు సర్వే పనులు చేపట్టారు. రైతులు భూములను స్వచ్ఛందంగా అందిస్తే రూ.20 లక్షలు, ఇంటి స్థలం, ఇంటికో ఉద్యోగం ఇస్తామని ప్రభుత్వం ఆశ చూపింది. ఆయా గ్రామాల్లోని అసైన్డ్ భూముల సర్వేతోపాటు రైతుల వద్ద నుంచి అనుమతి తీసుకొని రైతులకు నష్టపరిహారం కింద చెక్కులను పంపిణీ చేసింది. ప్రాణాలు పోయినా భూములు ఇచ్చే ప్రసక్తి లేదని రోటిబండతండా, పులిచెర్లకుంట తండాల రైతులు స్పష్టంచేశారు. అధికారులు పోలీసులను మోహరించి అసైన్డ్ భూములతోపాటు పట్టా భూముల్లో గ్రామ, తండాల్లో ముమ్మరంగా సర్వేలు పూర్తిచేశారు.

ఏడాదిన్నరగా పోరాటం

తమ భూములను తాము కాపాడుకోవడానికి రైతులు ఏడాదిన్నరగా భూ పోరాటం నిర్వహించారు. పోలీసు కేసుల కారణంగా ఇల్లు-వాకిలి విడిచి తిండీతిప్పలు లేకుండా పోలీస్‌స్టేషన్, అధికారుల చుట్టూ తిరిగారు. భూములను కాపాడుకోవడానికి గల్లీ నుంచి ఢిల్లీ వరకు తమ డిమాండ్స్ వినిపించారు. అంతేకాకుండా హైకోర్టును ఆశ్రయించి, న్యాయపోరాటం సాగించి, చివరకు విజయం సాధించారు. తమ పక్షాన న్యాయం ఉన్నందుకే కోర్టు ద్వారా తమకు ఊరట లభించిందని రైతులు చెప్తున్నారు. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ గురువారం కోర్టు స్టే విధించడంపై సంతోషం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా రైతు పక్షాన న్యాయం ఉన్నదని సీఎం గ్రహించి, భూముల జోలికి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సొంత నియోజకవర్గంలోనే సీఎంకు ఎదురుదెబ్బ

గతంలో కేసీఆర్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పాటుపడుతూ ఎన్నో అద్భుత పథకాలను అమలు చేసి వ్యవసాయాన్ని పండుగలా చేసిందని, కాబట్టే దేశంలోనే అత్యధికంగా వరి పంటను పండించి తెలంగాణ రాష్ట్రం అన్నపూర్ణ రాష్ట్రంగా ఏర్పడిందని రైతులు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను భిక్షగాడిని చేసే విధంగా కుట్రలు పన్నిందని వాపోయారు. భూములను లాక్కొని రైతు కంటనీళ్లు తెప్పించిందని ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి సొంత ఇలాకాలో పరిస్థితి ఈవిధంగా ఉండటం బాధకరమని, కోర్టు స్టేతో సీఎం రేవంత్‌రెడ్డికి ఎదురుదెబ్బ తగిలిందని వ్యాఖ్యానిస్తున్నారు.

లగచర్ల లడాయిలో ప్రజలే గెలిచారు

"అధికారాన్ని అడ్డుపెట్టుకొని సొంతవారి ప్రయోజనాల కోసం సీఎం రేవంత్‌రెడ్డి అమాయక గిరిజనుల భూములు లాక్కోవాలని చూసిన లగచర్ల లడాయిలో ప్రజలే గెలిచారు. రేవంత్‌రెడ్డి దమనకాండను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ లగచర్ల రైతులకు అండగా నిలిచి కేసుల నుంచి కాపాడింది. రైతుల పక్షాన చేసిన న్యాయ పోరాటంలో విజయం సాధించింది. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం కోసం నిరంతరం పోరాడే పార్టీ బీఆర్ఎస్ ఒక్కటేనన్న ప్రజల నమ్మకం ఇప్పుడు మరింతగా బలపడింది.

-గోపగాని రఘురాం, బీఆర్ఎస్ నేత

ఒకపక్క సంతోషం.. మరోపక్క బాధ

భూములు తీసుకోవద్దని కోర్టు స్టే ఇవ్వడం చాలా సంతోషంగా ఉన్నది. భూములను దక్కించుకోవడానికి చాలా బాధలు పడ్డాం. కేసులు అయ్యాయి. ప్రతి వారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్నాం. కోర్టు స్టే ఇవ్వడంతో మా కష్టం ఫలించింది. మాపై ఉన్న కేసులు కూడా ఎత్తేయాలని కోరుతున్నం. మా ప్రాణాలు పోయినా సరే మా భూములు ఇవ్వం. మా భూములే మా బతుకు, మా పిల్లలకు ఆధారం.

-పాత్లావత్ రుక్మమ్మ, రోటిబండతండా, దుద్యాల మండలం

నియంత ప్రభుత్వంపై లగచర్ల రైతుల ఘన విజయం

హైకోర్టు స్టే ఇవ్వడంతో నియంత ప్రభుత్వంపై లగచర్ల రైతులు ఘన విజయాన్ని సాధించారు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వం రైతులను ఇబ్బందిపెట్టింది. ఏడాదిన్నరగా బాధలు పడుతూ రైతులు గల్లీ నుంచి ఢిల్లీ వరకు అడుగులు వేశారు. కోర్టు స్టేతో రైతుల బాధలు తొలగిపోయాయి. రైతులకు బీఆర్ఎస్ అండగా నిలిచింది.